సంక్షేమం, అభివృద్ధికి చిరునామా వైసిపి ప్రభుత్వం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - పెదపాడు

సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. మండలంలోని తోటగూడెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచి ఏనుగ అబ్రహం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ నిస్సహాయులకు అండగా జగనన్న సురక్ష నిలుస్తోందన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. అర్హులైన పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎఎంసి ఛైర్మన్ అప్పన్న ప్రసాద్, ఎంపిపి బత్తుల రత్నకుమారి, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు గంటా ప్రసాద్‌రావు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కత్తుల రవి, తహశీల్దార్ విజయకుమార్‌రాజు, ఎంపిడిఒ నిర్మలాజ్యోతి పాల్గొన్నారు.

సాయం తీరు మారేనా..!

రేపాకగొమ్ము నుంచి ట్రాక్టర్లపై పునరావాస కేంద్రానికి తరలుతున్న వరద బాధితులు

- గోదావరి వరదపై విలీన మండలాల్లో టెన్షన్
- గతేడాది సహాయక చర్యల్లో తీవ్ర లోపం
- భద్రాచలం, కాపర్ డ్యామ్ వద్ద నిలకడగా గోదావరి నీటిమట్టం
- వేలేరుపాడు మండలంలో 16 గ్రామాలకు రాకపోకలు బంద్
- గ్రామం విడిచి వెళ్లేందుకు సిద్ధమైన రుద్రమ్మకోట, రేపాకగొమ్మి ప్రజలు
- కలెక్టర్, ఎస్‌పి, జెసి పర్యటన : ముందస్తు చర్యలపై ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వరద సహాయక చర్యలకు సంబంధించి గత అనుభవాలను గుర్తు పెట్టుకుని ప్రభుత్వం, అధికార యంత్రాంగం పని చేయాలని అంతా కోరుతున్నారు. గతేడాది వరదల సందర్భంగా సహాయక చర్యల్లో తీవ్ర లోపాలు చోటుచేసుకుని బాధితులు తాగునీటి కోసం సైతం తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితి తెలిసిందే. మళ్లీ గోదావరి వరద చుట్టుముట్టుతుండటంతో కుక్కునూరు, వేలేరుపాడు ప్రజల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది. ముందస్తు చర్యలపై జిల్లా అధికారులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిస్తున్నప్పటికీ వరద తరుణంలో బాధితులకు మాత్రం సహాయం అందని ద్రాక్షగానే ఉంటుంది. ఈసారి అటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటేనే వరద బాధితులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. గడిచిన ఏడాది జులైలో విరుచుకుపడిన వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన వరద బాధితులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీకావు. ఇంటి పైకప్పులు ఎక్కి తాగునీటి కోసం పడవలపై వెళ్లేవారిని దీనంగా కోరిన పరిస్థితి తెలిసిందే. ఆధార్ కార్డు చూపితే తప్ప ఒకవాటర్ ప్యాకెట్ కూడా ఇవ్వని దుస్థితి. కొవ్వొత్తులు, కిరోసిన్ వంటివి బాధితులకు సక్రమంగా అందించలేదు. దీంతో కొండలు, గుట్టలపైకి వెళ్లిన వారు దీపం వెలిగించుకునేందుకు చీకట్లోనే కాలం గడపాల్సి వచ్చింది. రావికుంట, కివ్వాక వంటి పునరావాస కాలనీల్లో తాగునీరు లేక అక్కడికి చేరినవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరెంటు సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంపై బాధితులు గగ్గోలు పెట్టారు. గర్భిణులను వరద ఉధృతి పెరిగిన తర్వాత తరలించడంతో ఒకింత ఆందోళన నెలకొంది. తాగునీరు అందించాలని సిపిఎం నేతలు కుక్కునూరు తహశీల్దార్‌ను కలిసి విన్నవించాల్సి వచ్చింది. కూరగాయలు సైతం సరిగ్గా అందక పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. మళ్లీ గోదావరి వరద ఉధృతం అవుతుండటంతో ముందస్తు చర్యలపై అధికారులు గతానుభవాలను పున:సమీక్షించుకోవాల్సి ఉంది. గతేడాది భద్రాచలం వద్ద 50 అడుగులు దాటేసరికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని చాలా గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశించింది. దీంతో కట్టుబట్టలతో అక్కడి ప్రజలు బయటపడాల్సి వచ్చింది. వరద ఉధృతిపై అధికారులెవరూ తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని అప్పట్లో వరద బాధితులు వాపోయారు. ఈసారైనా వరదకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల ప్రజలకు తెలియజేసేలా టాంటాంగాని, మైక్ ప్రచారంగాని నిర్వహించాల్సి ఉంది. క్షేత్రస్థాయి అధికారుల చర్యలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటేనే ఎంతోకొంత ఉపయోగముంటుందనే అభిప్రాయం ఉంది. లేకపోతే గతేడాది వరద కష్టాలే మళ్లీ పునరావృతమ అయ్యే పరిస్థితి ఉంది.

నిలకడగా గోదావరి.. ★★★

శుక్రవారం గోదావరి వరద కొంత నిలకడగా ఉంది. భద్రాచలం వద్ద నీటిమట్టం గురువారం 43 అడుగులకుపైగా చేరగా, శుక్రవారం సాయంత్రానికి కొంత తగ్గి 42.9 అడుగులకు చేరింది. పోలవరం కాపర్ డ్యామ్ వద్ద సైతం 33 మీటర్ల వద్ద నీటిమట్టం నిలకడగా ఉంది. గోదావరి పరివాహక ప్రాంతాలైన ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండటంతో గోదావరి వరద పెరుగుతుందనే ఆందోళన నెలకొంది. ఇప్పటికే వరద నీరు రోడ్లపైకి చేరడంతో వేలేరుపాడు మండలంలో రుద్రమ్మకోట, వసంతవాడ, కన్నాయిగుట్ట, కొయిదా, వేలేరుపాడు, రేపాకగొమ్ము, బోళ్లపల్లి, యడవల్లి మధ్య దాదాపు 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు మండలంలో గొమ్ముగూడెం గ్రామస్తులను ఇప్పటికే రావికుంట పునరావాస కాలనీకి తరలించారు. రుద్రమ్మకోట గ్రామస్తులు కొండపైకి వెళ్లేందుకు సన్నద్ధమవుతుండగా రేపాకగొమ్ము గ్రామస్తులను రావికుంట పునరావాసానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి వరద పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలకు సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి, జెసి లావణ్య, ఇతర జిల్లా అధికారులు వేలేరుపాడు మండలంలో పర్యటించి ఎంఇఒ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు.

గోదావరికి వరద ఉధృతి

సురక్షిత ప్రాంతాలకు గొమ్ముగూడెం వాసులు - 14 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద ఉధృతి కొనసాగుతోంది. కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వేను వరదనీరు ముంచెత్తడంతో రెండు రోజులుగా 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే గొమ్ముగూడెం చుట్టూ వరద నీరు చేరడంతో ఆ గ్రామానికి చెందిన 253 కుటుంబాలను రావికుంటలోని పునరావాస కేంద్రానికి తరలించారు. వారికి అవసరమైన బియ్యం, నిత్యావసరాలను అందిస్తున్నట్లు తహశీల్దార్ ప్రమద్వర తెలిపారు.

వేలేరుపాడు: మండలంలో వరద ఉధృతి శుక్రవారమూ కొనసాగడంతో రుద్రమ్మకోట, వసంతవాడ, రేపాకగొమ్ము, వేలేరుపాడు, కన్నాయిగుట్ట, కొయిదా మధ్య ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో 30 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రేపాకగొమ్ము, రుద్రమ్మకోట గ్రామాలను వరద చుట్టుముడుతుండటంతో రుద్రమ్మకోట గ్రామస్తులు సమీపంలోని గుట్టపైకి, రేపాకగొమ్ము గ్రామస్తులు కుక్కునూరులోని రావికుంట పునరావాస కేంద్రానికి తరలివెళ్తున్నారు. వీరికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులను అందిస్తామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమేష్ తెలిపారు.

విలీన మండలాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వేలేరుపాడు: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేలేరుపాడు ఎంఇఒ కార్యాలయంలో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద పరిస్థితిపై జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరద నేపథ్యంలో బాధితులకు అందుబాటులో ఉంటూ ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. వరదల మూలంగా ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఒక్క ప్రాణ నష్టానికీ తావులేకుండా చూడాలన్నారు. గతేడాది వరదల సమయంలో ఎదురైన సంఘటనలు పునరావృతం కాకుండా మరింత పటిష్టంగా పునరావాస సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. కొయిదా, కట్కూరు ప్రాంతంలో 16 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయన్నారు. అక్కడి ప్రజలకు అవసరమైన నిత్యావసరాలను అందించాలని ఆదేశించారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలను సిద్ధంగా ఉంచాలని సివిల్ సప్లయిస్ డిఎంను ఆదేశించారు. కొవ్వొత్తులు, బ్యాటరీ లైట్లు కూడా సమకూర్చాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి జనరేటర్లు సిద్ధం చేయాలన్నారు. 21 రోజులకు సరిపడే మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పాముకాటు ఇంజక్షన్లు, రక్తపోటు, షుగరు, గుండెకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. మండల కేంద్రంలో రెండు 108 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. వరదలు వచ్చి, తగ్గిన మధ్యకాలంలో పారిశుధ్య కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని డిపిఒను ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద చేతిపంపులు ఏర్పాటు చేయాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన వాటర్ ప్యాకెట్లను, క్లోరిన్ బిళ్లను సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని ఆదేశించారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు కుక్కునూరు మండలానికి సంబంధించి జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, వేలేరుపాడు మండలానికి సంబంధించి ఐటిడిఎ పిఒలు పర్యవేక్షించాలన్నారు. నిత్యావసర వస్తువులను ప్యాకింగ్ చేసేందుకు స్థానికంగా ఉన్న ఎస్‌హెచ్‌జి మహిళలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. భద్రాచలం, పోలవరం, ధవళేశ్వరంకు సంబంధించి వరద పరిస్థితిపై ప్రతి రెండు గంటలకు నివేదికను అందజేయాలని ఇరిగేషన్ ఎస్‌ఇని కలెక్టర్ ఆదేశించారు. పోలవరం నెక్లెస్ బండ్ కోతకు గురైతే వెంటనే చర్యలు చేపట్టేందుకు జెసిబిలు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వభరత్, ఐటిడిఎ పిఒ సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, జెడ్‌పిటిసి రామలక్ష్మి, ఎంపిపి లక్ష్మీదేవిరెడ్డి పాల్గొన్నారు.

పోలవరం: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాలైన పోలవరం, ఎడ్లగూడెం, పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాలల్లో రేవు పాయింట్లను అధికారులు పరిశీలించారు. తహశీల్దార్ బి.సుమతి, విఆర్‌ఒలు దత్తు వరప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఏటిగట్టు పరిస్థితిని సమీక్షించారు.

తక్షణం సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం

వేలేరుపాడు: వరద బాధితులకు తక్షణం సహాయక చర్యలు చేపట్టి, అవసరమైన నిత్యావసర సరుకులు అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 30 గ్రామాల వరకు రాకపోకలు బంద్ అయ్యాయని, గతేడాదిలా కాకుండా ప్రతి ముంపు బాధితుడినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఇంటి సామగ్రి తరలించడంలో ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని ఆర్థికంగా ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులు, గుడారాలు వేసుకోవడానికి టార్పలిన్లు, కొవ్వొత్తులు అందించాలని కోరారు. పడవలను సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రక్షకుడే భక్షకుడు..!

బాలికపై వరుసకు సోదరుడు అఘాయిత్యం
ఆపై మరో మైనర్, లారీ డ్రైవర్ అత్యాచారం
ఆరు నెలలుగా సాగుతున్న నిర్వాకం వెలుగులోకి

ప్రజాశక్తి - మండవల్లి

ఆ దంపతులు పక్క మండలంలో చేపల చెరువుపై కాపలాగా ఉండి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. తమ కుమార్తెకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని మండల కేంద్రంలోని హాస్టల్‌లో చేర్పించారు. ఐదో తరగతి చదువుతున్న ఆ బాలిక ప్రతిరోజూ సమీప జెడ్‌పి హైస్కూల్‌కు వెళ్లొస్తోంది. అయితే హాస్టల్ సమీపంలోనే ఉంటున్న సమీప బంధువు, వరుసకు సోదరుడు బాలికను అప్పుడప్పుడు ఇంటికి తీసుకొచ్చి మళ్లీ హాస్టల్‌లో దింపేవాడు. ఈ క్రమంలో ఐదు నెలల క్రితం అంటే బాలిక నాలుగో తరగతిలో ఉండగానే ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన ఆ ఇంటి యజమాని కుటుంబానికి చెందిన మరో బాలుడు బాలికను బెదిరించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే బాలికపై సమీప లారీ డ్రైవర్ ఖాదర్ (45) అత్యాచారానికి పాల్పడ్డాడు. నాటి నుంచి వరుసగా వీరు బాలికపై అత్యాచారానికి పాల్పడుతూనే ఉన్నారు. నాలుగు రోజుల క్రితం బాలికను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన వరుసకు సోదరుడితో వెళ్లేందుకు బాధితురాలు నిరాకరించింది. ఇది గమనించిన హాస్టల్ సిబ్బంది ఆరా తీయగా విషయం వెలుగుచూసింది. దీనిపై వారు బాధితురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటీన తరలొచ్చారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరుసకు సోదరుడయ్యే ప్రబుద్ధుడు పరారీలో ఉండగా మరో మైనర్, లారీ డ్రైవర్ ఖాదర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాలికను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డిఎస్‌పి శ్రీనివాసులు హాస్టల్‌ను, అత్యాచారానికి పాల్పడిన ఇంటి ప్రాంతాన్ని పరిశీలించారు.

అభివాదం చేస్తున్న రైతు, ప్రజాసంఘాల నేతలు

సాగు నష్టాలకు మోడీ విధానాలే కారణం

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి
మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి
పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలి
ఎస్‌కెఎం జిల్లా సదస్సులో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్రంలో మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నేడు వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, వ్యవసాయ నష్టాలకు, రైతు ఆత్మహత్యలకు మోడీ ప్రభుత్వ విధానాలే కారణమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సదస్సులో వివిధ రైతు సంఘాల రాష్ట్ర నాయకులు తీవ్రంగా విమర్శించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయ హాలులో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సుకు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరంగి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మణరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సదస్సులో ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్ముల సురేష్, ఎఐకెకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషా, బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య నాయకులు శ్రావనంపూడి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.రమణ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.కృష్ణ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి, శ్రామిక మహిళ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న మాట్లాడారు. పంటలన్నింటికీ చట్టబద్ధ కనీస మద్దతు ధరలను నిర్ణయించాలన్నారు. రైతులు, పేదల పాలిట ఉరితాడు లాంటి విద్యుత్ బిల్లును పార్లమెంటులో ఉపసంహరించాలని కోరారు. వ్యవసాయ పంపుసెట్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను ఒక్క పర్యాయం రద్దు చేయాలన్నారు. కేరళ తరహా రైతు రుణ ఉపశమన చట్టం'ను పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలన్నారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, డిస్కాంలు, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లు తదితర ప్రభుత్వరంగ సంస్థలను మానిటైజేషన్ పేరు మీద అమ్మరాదన్నారు. రైతుల సహకార పాల డెయిరీలను కార్పొరేట్ సంస్థల పరం చేయడం దారుణమని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసానికి అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనడం న్యాయసమ్మతం కాదన్నారు. ఇప్పటికైనా వెంటనే అవసరమైన నిధులను కేంద్రమే మంజూరు చేసి ఆదివాసీలు, దళితుల బాధిత ప్రజల పునరావాస పనులు పూర్తి చేయించాలన్నారు. అటవీ హక్కుల చట్టంను విస్మరిస్తూ ఆదివాసీల హక్కులకు భంగం కలగనీయరాదని, పోడు భూముల సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో అశువులు బాసిన 750 రైతు కుటుంబాలకు, లఖింపూర్‌ఖేరీ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఐదు కుటుంబాలకు సాయం అందించడంతోపాటు కేంద్రమంత్రి అజయ్‌మిశ్రా తేనీని మంత్రివర్గం నుండి వెంటనే తప్పించాలన్నారు. మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశానికి అవమానకరమని ఖండించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై తీర్మానాన్ని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రవేశపట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

162 మందికి వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం సొమ్ము

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ కె.పెంచల్‌కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం ఐదో విడత కింద 2023-24 సంవత్సరానికి జిల్లాలో 162 మంది చేనేత లబ్ధిదారుల ఖాతాలో రూ.38.88 లక్షలు ఆర్థిక సహాయం జమ చేసినట్లు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల్‌కిషోర్ తెలిపారు. శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయి వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం సహాయ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. దీన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి పెంచల్‌కిషోర్ చేనేత లబ్ధిదారులతో కలిసి తిలకించారు. అనంతరం వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం కింద ఏలూరు జిల్లాలో అర్హులైన 162 మంది చేనేత లబ్ధిదారుల ఖాతాకు సిఎం బటన్ నొక్కడం ద్వారా జమ చేశారు. ఈ సందర్భంగా రూ.38.88 లక్షల మొత్తం నమూనా చెక్కును ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ పెంచల్ కిషోర్ చేనేత లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత మగ్గాల సామగ్రి ఆధునికీకరణకు వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు మొత్తాన్ని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. జిల్లాలో ఐదో విడతకు సంబంధించి ఏలూరు నియోజకవర్గంలో 13 మందికి, కైకలూరులో 148 మందికి, దెందులూరు నియోజకవర్గంలో ఒకరికి రూ.24 వేలు చొప్పున సొమ్ము జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ డెవలపమెంట్ ఆఫీసర్ బి.హనుమంతు, జిల్లాలోని లబ్ధిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో 481 మందికి సీట్లు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో శుక్రవారం తొలిరోజు 481 మందికి సీట్లు కేటాయించినట్లు అడ్మిషన్ కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. మొత్తం 550 మందిని కౌన్సిలింగ్‌కు పిలిచామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను ఆర్‌జెయుకెటి ఛాన్సలర్ ఆచార్య కెసి.రెడ్డి పరిశీలించారు. అనంతరం పలువురు విద్యార్థులకు సీట్ అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఏలూరు: జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను, ఉద్యోగులను అడుగడుగునా మోసగించిందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విమర్శించారు. స్థానిక నగరపాలక సంస్థ వద్ద రెండో రోజు శుక్రవారం మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. పిఆర్‌సి కమిటీ కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయిస్తే జగన్ ప్రభుత్వం రూ.15 వేలే ఇచ్చిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి నట్టేట ముంచిందని విమర్శించారు. సిపిఎస్ విషయంలో మొండిచెయ్యి చూపిందన్నారు .కనీసం సంక్షేమ పథకాలు కూడా అమలు చేయకుండా ఆప్కాస్‌లో చేర్చి ప్రభుత్వ ఉద్యోగులని దుష్ప్రచారం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి, ఆగస్టు 7న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15 తర్వాత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనాల వెంకట్రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడారు. శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ప్రారంభించగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు అధ్యక్షత వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నేత పి.హైమావతి సంఘీభావం తెలపగా లావేటి కృష్ణారావు, బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు, కారు దుర్గారావు, జార్జి, నాగరాజు, రేణుకేశ్వరరావు, గోపి, రాము, మహంకాళి, రమేష్, సత్యనారాయణ, పుష్పరాజు, సుగుణరావు, సోమేశ్వరరావు, కొండలరావు పాల్గొన్నారు.



నినదిస్తున్న నేతలు, కార్మికులు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు సీనియర్ నాయకులు చల్లారి మాణిక్యాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద పసల సూర్యారావు అధ్యక్షతన రెండో రోజు రిలే నిరాహారదీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు కార్మికులకు ఎర్ర రిబ్బన్లు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చాక కార్మికులకు నష్టమేగానీ లాభం చేకూర్చే పని ఏఒక్కటీ చేయలేదన్నారు. సిఐటియు పట్టణాధ్యక్షులు సూర్యారావు మాట్లాడగా యూనియన్ అధ్యక్షులు బి.బాలరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, వేల్పుల రాజు, జి.వెంకటేష్, ఇంజినీరింగ్ వర్కర్స్ కొత్తూరు లక్ష్మణరావు, దోసూరు నాగరాజు, సుబ్రహ్మణ్యం, శ్రీను పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన రెండోరోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయలక్ష్మి, చంద్రశేఖర్, రాజేంద్ర, గోవింద్, జయరాం, కొండలు, పద్మ, రజిని పాల్గొన్నారు.

'మణిపూర్' కారకులను శిక్షించాలని ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మణిపూర్‌లో ఇద్దరు గిరిజన యువతులను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రైతుకూలీ సంఘం (ఎపి) ఆధ్వర్యాన శుక్రవారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద నిరసన నిర్వహించారు. గిరిజన యువతులను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మణిపూర్‌లో బిజెపి రెచ్చగొడుతున్న మతతత్వ రాజకీయాలను ఖండించాలని నినదించారు. ఈ కార్యక్రమానుద్దేశించి రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ రెండు నెలలుగా మణిపూర్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొనడానికి బిజెపి మతతత్వ రాజకీయాలే ప్రధాన కారణమని విమర్శించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మణిపూర్ లో శాంతిని నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా అధ్యక్షులు కుంజం రామారావు మాట్లాడుతూ మణిపూర్లో గిరిజనులపై ఇంతటి అమానుష ఘటన జరిగినా ఒక గిరిజన మహిళగా రాష్ట్రపతి స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.

కొనసాగిన విఆర్‌ఎల నిరసన దీక్ష

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులో దీక్షలు ప్రారంభిస్తున్న నేతలు

తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డిఎతో కూడిన జీతం ఇవ్వాలని, అర్హులకు ప్రమోషన్స్ ఇవ్వాలని కోరుతూ విఆర్‌ఎలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష శుక్రవారం కొనసాగింది. శిబిరాన్ని సిఐటియు పట్టణ కమిటీ అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు, కార్యదర్శి జి.రాజు, ఐద్వా నేత నండూరి పద్మాంజలి సంఘీభావం తెలిపారు.

నిడమర్రు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సభకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చోడవరపు తులసీరామ్, ఓగిరాల ముత్యాలు, సారిక, దిలీప్, పి.సీతారాముడు, మాగంటి శ్రీను, వానపల్లి శేషగిరి పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పన అభినందనీయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉద్యోగ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఎంఎల్ఎ మాట్లాడుతూ నిరుద్యోగులు తమకు లభించిన అవకాశాలన్నింటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు మరిన్ని నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులంతా ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

జాబ్‌మేళాలో 129 మంది ఎంపిక

జాబ్‌మేళాలో 129 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు తెలిపారు. ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు 24, అపోలో ఫార్మసీలో 26, ముత్తూట్ ఫైనాన్స్ 17, ఎస్‌బిఐ లైఫ్ 30, టిసిఎల్ 21 మంది మొత్తం 129 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు రెయిన్ కోట్లు, బ్యాగులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గరుడ పక్షి నగర్ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది రెయిన్ కోట్లు, బ్యాగులు అందించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 166వ వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, రెయిన్ కోట్లు సరఫరా చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రమాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా ఇన్‌ఛార్జి జె.ఉమావెంకటేష్, అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నెల్లిపోల్ల ప్రభాకరరావు, ఉపాధ్యాయులు టి.నాగార్జునరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులుగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులుగా నాగేశ్వరరావు నియామకమైనట్లు ఆ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావులు శుక్రవారం నియామక పత్రాన్ని నాగేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కిసాన్ సెల్ జిల్లా పదవిలో నియమించిన పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు అందక, ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తరపున రైతు సమస్యలపై పోరాటం చేస్తామని, రైతు విభాగాన్ని బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ, ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంతో సత్ఫలితాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో నెలవారీగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం సత్ఫలితాలను ఇస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సోహిని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులతో పాటు కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. ఇదే క్రమంలో మొక్కల పెరుగుదల ప్రభావం మానవ జీవిత ప్రగతిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల రీజినల్ ఇన్‌ఛార్జి పార్థసారథి, అకాడమిక్ సమన్వయకర్త ఉదయ భాస్కర్, డీన్ వి.భార్గవకిరణ్, ఎఒ ముఖేష్ కుమార్, పాఠశాల ఇన్‌ఛార్జి కిరణ్ పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించాలని చింతలపూడి అగ్రికల్చర్ ఎడి నాగకుమార్ అన్నారు. మండలంలోని గణిజర్ల గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రపురుగుల సంరక్షణ ద్వారా శత్రు పురుగులను ఏ విధంగా అరికట్టవచ్చో రైతులకు వివరించారు. ఎరువులు సరైన మోతాదులో సరైన సమయంలో వేయడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అనంతరం మట్టి నమూనా సేకరణ, విత్తన శుద్ధి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ అధికారి రమ్య, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ, నమోదుకు సహకరించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రభుత్వం ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఓటర్ల సర్వేకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ రాజేంద్రన్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో టిడిపి, వైసిపి, బిజెపి, వామపక్షాలు, జనసేన పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళ నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బిఎల్ఒలు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు చేరువగా జిసిసి ఉత్పత్తులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిసిసి ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసేందుకు గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ సంస్థ కొత్త ప్రణాళికలు రూపొందిస్తుందని జిసిసి చైర్ పర్సన్ శోభ స్వాతిరాణి అన్నారు. మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న జిసిసి సూపర్ మార్కెట్ భవనాన్ని, స్థానిక సంత మార్కెట్‌లో ఉన్న జిసిసి గోడౌన్‌ను జిసిసి మేనేజర్ భాస్కర్ ఆధ్వర్యంలో ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ యూసఫ్, ఆ సంస్థ డైరెక్టర్ చినబాబు, డిఎం విజయలక్ష్మి, రంపచోడవరం డిఎంఎం పార్వతీశం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కొట్లాటపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అన్నదమ్ముల మధ్య ఏర్పడ్డ వివాదం చిలికి చిలికి గాలి వానగా మారి కొట్లాటకు దారి తీసిన సంఘటన మండలంలోని వైవాకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వైవాక గ్రామానికి చెందిన గోవాడ నరేష్, సురేష్ అన్నదమ్ములు. వీరిద్దరు ఉమ్మడిగా ఆటో, నీటిని తోడే ఇంజన్ కొనుగోలు చేసి నడుపుతున్నారు. ఈ క్రమంలో నరేష్ కొంతకాలంగా ఆటో, ఇంజన్‌ని వచ్చే ఆదాయం తమ్ముడు సురేష్‌కు ఇవ్వకుండా తానే వాడుకుంటున్నాడు. తన వాటాగా వచ్చే డబ్బును అన్న ఇవ్వకపోవడంతో ఈ విషయమై సురేష్ తన అన్న నరేష్‌ను ప్రశ్నించాడు. దీంతో నరేష్ నీకు వాటా ఇవ్వాల్సిన పని లేదని సురేష్‌ను బెదిరించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో సురేష్ గాయపడ్డాడు. సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అధిక కట్నం కావాలంటూ భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెనుమల్లి శివారు శింగవరానికి చెందిన అరుణకు మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన మదిరి ఫణీంద్రతో 16 ఏళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భర్త ఫణీంద్ర అధిక కట్నం తీసుకురావాలంటూ భార్యను నిత్యం వేధిస్తూ మానసికంగా ఇబ్బందులు పెడుతున్నాడు. భర్త పెట్టే హింసను భరించలేని అరుణ శుక్రవారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఆకుల శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రవాణా రంగం కార్మికులందరికీ 'వాహన మిత్ర' అందించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ వాహన మిత్ర పథకం ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ప్రశ్నించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో బుద్ద నాగ సూరిబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆర్.లింగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి మాట్లాడారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఏటా రూ.20 వేల కోట్ల ఆదాయాన్ని సంపాదించి పెడుతున్న రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న విధానాలే కారణమని విమర్శించారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తనకంటే గొప్పవారు లేరని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి రవాణారంగ కార్మికులందరికీ వాహన మిత్ర పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బస్సు డ్రైవర్లు, లారీ, ట్రాక్టర్, క్యాబ్ డ్రైవర్లు, మెకానిక్‌లు, హెల్పర్లు ఇలా రవాణా రంగంలో కార్మికులందరూ వాహన మిత్రకు ఎందుకు అర్హులు కారో చెప్పాలన్నారను. వారి ఓట్లు మీకు అవసరం లేదా అని నిలదీశారు. నిత్యం ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్న రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వాలు మాత్రం ఎటువంటి సహాయం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో గాయాలపాలై వికలాంగులైన డ్రైవర్లకు ఎటువంటి నష్ట పరిహారం, పెన్షన్ అందడం లేదన్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం కేరళ తరహా సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య, గౌడు రవీంద్రబాబు, దోమతోటి థామస్, పోచారపు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు.

నేడు ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్‌కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లికృష్ణ తెలిపారు. ఏలూరు న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన ప్రమాద క్లైములు, భూ నష్ట పరిహార క్లైముల పరిష్కారం నిమిత్తం ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏలూరులో మూడు లోక్ అదాలత్ బెంచీలను, కొవ్వూరులో ఒక బెంచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, కక్షిదారులు, న్యాయవాదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

యువత, విద్యార్థులు, నిరుద్యోగులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకునేలా స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా సెట్‌వెల్ సిఇఒ మెహెర్ అన్నారు. మండలంలోని నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రారంభోత్సవ సభకు విశేష స్పందన వచ్చిందని ప్రిన్సిపల్ తెలిపారు. ఎస్‌బిఐ లైఫ్, ఎయిర్‌టెల్, స్పిన్నింగ్‌మిల్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 60 మంది, ప్రత్యక్షంగా 175 మంది మొత్తం 235 మందికి పైగా యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లు, విద్యార్హతల ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు ఇవ్వనున్నారు. కళాశాల ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు, జామ్‌మేళా కో-ఆర్డినేటర్ కొండా రవికుమార్, జూనియర్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాసు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఆడిటోరియం ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్స్ యాక్టివిటీ కేంద్రంలో ఆధునీకరించిన చిన్న ఆడిటోరియాన్ని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌జియుకెటి ఎమిటస్ ఆచార్యులుగా పనిచేస్తున్న కె.వియన్నారావు రచించిన భవిష్యత్తు విద్య అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు, పరిశోధన విభాగాధిపతి ఆచార్య జి.మోహనరావు, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య గోపాల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బజారులో తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం

మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిరంజీవులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సరుకులు తీసుకుంటున్న ప్రజలు

నిత్యావసర సరుకుల ధరలు బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం రైతు బజారులో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందిస్తున్నామని ఏలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్.చిరంజీవులు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశాల మేరకు నగరంలో వన్‌టౌన్ రైతు బజారు, పత్తేబాద రైతు బజారులోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.134లకే కందిపప్పు అందించే కౌంటర్లు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఏలూరు వన్‌టౌన్‌లో ఉన్న రైతు బజారు కౌంటరును ఏలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్.చిరంజీవులు, పత్తేబాద రైతు బజారులో కౌంటర్లను జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఎన్.చిరంజీవులు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలు పెరగడం ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే అందించాలనే సదుద్దేశంతో రైతుబజారుల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ పత్తేబాద, వన్‌టౌన్ రైతు బజారుల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు కేజీ కందిపప్పు రూ.134కే అందిస్తున్నామని, బియ్యం కౌంటర్ ద్వారా స్వర్ణ బియ్యం కిలో 34, పిఎల్ 40, సోనామసూరి రూ.48 అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారులు లక్ష్మణబాబు, వై.ప్రతాపరెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు అమలు చేసిన ఘనత జగన్‌దే'

ప్రజాశక్తి - ముసునూరు

నవరత్నాల్లో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన 99.2 శాతం హామీలను వాలంటీర్ల ద్వారా నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డిదని వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, ఎంపిపి రావర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మండలంలోని ఐదు సచివాలయాలు పూర్తయ్యాయన్నారు. ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. సీసీ రోడ్లు నిర్మించామని, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించామని, వీధిలైట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్‌బికె, సొసైటీల ద్వారా వరి, మొక్కజొన్న పంటలు ప్రభుత్వం ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలో గోపవరం, ముసునూరు, వేల్పుచర్ల, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాల్లో ఇళ్ల స్థలాల సమస్య పూర్తి చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

బిజినెస్ కరస్పాండెట్లు కాజేసిన సొమ్ము 31 లోపు జమ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ మేనేజర్ హామీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలోని నరశింగపాలెం, సగ్గూరు, తోటపల్లి గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళల నుంచి ఆయా గ్రామాల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ కరస్పాండెట్లు కాజేసిన సొమ్మును ఈ నెల 31వ తేదీలోపు చెల్లిస్తామని యూనియన్ బ్యాంక్ అధికారులు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని నరశింగపాలెంలో 35 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.76.43 లక్షలు, సగ్గూరులో 29 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.29లక్షలు, తోటపల్లిలో నాలుగు డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.1.72లక్షలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎంఒయు చేసుకొన్న ఇంట్రిగ్రా ఏజెన్సీ ద్వారా నియమితులైన బిజినెస్ కరస్పాండెట్లు కాజేశారు. బాధిత మహిళలు జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. డ్వాక్రా మహిళలకు ఈ నెల 21 తేదీకల్లా న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళన చేపడతామని చెప్పారు. శుక్రవారం ఎంఎల్ఎ ఆగిరిపల్లి యూనియన్ బ్యాంక్ వద్దకు పెద్దఎత్తున మహిళలతో చేరుకొని బ్యాంకు అధికారులతో చర్చించారు. కరస్పాండెట్లు కాజేసిన సొమ్మును రికవరీ చేసి మహిళల ఖాతాల్లో ఈ నెల 31వ తేదీలోపు జమ చేస్తామని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ మేనేజర్ హరీష్ రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్, నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు, ఎస్ఐ చంటిబాబు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ జగన్మోహనరావు, వెలుగు ఎపిఎం బి.రామకృష్ణ పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ అందించేందుకు కృషి

విద్యుత్ శాఖ ఎఇ రవికుమార్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎఇ రవికుమార్

వర్షాకాలంలో ముందస్తుగానే విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు, చెట్ల కొమ్మలను తొలగించే చర్యలు చేపట్టడంతో విద్యుత్ అంతరాయలు తగ్గుతాయని మండల విద్యుత్ శాఖ ఎఇ పి.రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 22వేల విద్యుత్ సర్వీసులు ఉన్నాయన్నారు. వాటిలో 1500 ఆక్వా సర్వీసులు కాగా, వేయి దుకాణాల సర్వీసులు, మండల వ్యాప్తంగా 125 వీధిలైట్లు, గ్రామ పంచాయతీల వాటర్ వర్క్సుకు సంబంధించినవి ఉన్నాయన్నారు. ప్రజలకు, రైతులకు విద్యుత్ సేవలు అందించేందుకు ముదినేపల్లి, కొత్తపల్లి, పెదపాలపర్రు, చిగురుకోట, సింగరాయపాలెం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈఐదు సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆక్వా రైతులకు, గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ కోతలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను అంది స్తున్నామన్నారు. ఐదు నుంచి పది ఎకరాల లోపు ఉన్న 1300 మంది ఆక్వా రైతులు ఆక్వా విద్యుత్ సబ్సిడీని పొందు తున్నారన్నారు. మం డల వ్యాప్తంగా 19 ఫీడర్లు ద్వారా విద్యుత్‌ను అంది స్తున్నామన్నారు. లో ఓల్టేజీ ప్రాంతాల్లో 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించినట్లు ఆయన చెప్పారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో రూ.4కోట్ల మేర విద్యుత్ బకాయిలు పంచాయతీల నుంచి జమ కావాల్సి ఉందన్నారు. విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించే చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలను పట్టుకోవడం, చుట్టు నిలబడడం చేయరాదన్నారు. తెగి నేలపై పడిన విద్యుత్ తీగలను పట్టుకోరాదన్నారు. ఆక్వారైతులు చెరువుల గట్లపై, నేల మీద విద్యుత్ వైర్లు వేయరాదన్నారు. వైర్లను చెరువు గట్టుపై నాలుగు అడుగుల ఎత్తులో స్తంభాలకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో గాలులకు ఎక్కడైన తీగలు తెగిపడితే వాటిని పట్టుకోకుండా వెంటనే 9440812171 ద్వారా తమ కార్యాలయానికి సమాచారం అందిస్తే తమ సిబ్బంది వచ్చి ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటారని ఎఇ పి.రవికుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ముసునూరు



ఉంగుటూరులో...

ప్రజా సంక్షేమ పథకాలతో పాటు వైద్య సేవలు పేదోడికి అందేలా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని జెడ్‌పిటిసి సభ్యులు డాక్టరేట్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని ముసునూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు మాట్లాడారు.

ఇళ్ల పట్టాలివ్వాలని వినతి

స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి మురళీ డిమాండ్ చేశారు. ఈ మేరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో తహశీల్దార్ దాసరి సుధకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ఎన్నోఏళ్ల తరబడి కరెంట్, నీరు, రోడ్లు లేక, సరైన ఇళ్లు లేక పేదలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. గుడిసెలు వేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ముసునూరు రెవెన్యూ పరిధిలో నల్లచెరువు, కొత్త చెరువు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, వాటిని ఆక్రమణల నుండి తొలగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మద్దాల బాబూరావు, పోట్రు శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాసరావు, నక్కా రంగారావు, పేరిచర్ల తాతయ్య, రెడ్డి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు : సర్పంచి బండారు సింధు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అనంతరం ధ్రువపత్రాలు అందించారు. వికలాంగులకు రాయితీపై మూడు చక్రాల వాహనం అందించారు. పంచాయతీ కార్యదర్శి కాకర్ల గిరిధర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అక్కుపల్లిగోకవరంలో సర్పంచి మిద్దే సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు పాల్గొని దరఖాస్తులు చేసుకున్నవారికి వివిధ ధ్రువపత్రాలను అందించారు.

జీలుగుమిల్లి : జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి అర్హతను బట్టి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపిపి కోర్స పోసమ్మ అన్నారు. మండలంలోని తాటియాకులగూడెం పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పరిసరాల్లో మొక్కలు నాటారు.

భీమడోలు : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులకు సత్వర చెల్లింపులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు తెలిపారు. పూళ్ల గ్రామ సచివాలయం-3 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి దాయం సుజాతప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యత స్వీకరించిన మండల కమిటీ బాధ్యులు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి మాట్లాడారు.

నూజివీడు రూరల్ : మండలంలోని మెర్సపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ వి.విజయ్‌కుమార్‌బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. 163 మందికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, గ్రామ సర్పంచి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలో ఇప్పటివరకు 11 రకాల సర్టిఫికెట్లను 17293 మంది లబ్ధిదారులకు అందించినట్లు ఎంపిపి జ్యోతి తెలిపారు. మండలంలోని వేగవరంలో శుక్రవారం జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

ముదినేపల్లి : మండలంలోని పేయ్యేరు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ సర్పంచి అల్లు సుశీలా అధ్యక్షతన సభ నిర్వహించారు.

కలిదిండి : మండలంలోని చిన తాడినాడలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. అర్హులైన దరఖాస్తుదారులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు.

ద్వారకాతిరుమల : మండలంలోని ఎం నాగులపల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

టి.నరసాపురం: మండలంలోని తిరుమలదేవి పేటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన వంద మంది జనసేన, టిడిపి పార్టీలో నుంచి వైసిపిలోకి చేరారు. వీరిని ఎంఎల్ఎ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

పోలవరం : మండలంలోని వింజరంలో సర్పంచి వెంకటలక్ష్మి, ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు కందిపప్పు ఇవ్వాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రు గ్రామానికి నాలుగు నెలలుగా ఎండియు వాహనం ద్వారా కందిపప్పును కార్డుదారులకు ఇవ్వడం లేదంటూ వ్యసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ అన్నారు. శుక్రవారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన కందిపప్పును ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూడా పేదలకు కందిపప్పు ఇవ్వకపోవడంతో పేదలు ఎదురు చూస్తున్నా రన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారుల ను అడిగితే పొంతనలేని సమాధానం చెబుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి వెంటనే పేదలకు కందిపప్పు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

ముదినేపల్లి ఎస్ఐగా వెంకట్‌కుమార్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి నూతన ఎస్‌గా దేశంశెట్టి వెంకట్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ముదినేపల్లి ఎస్ఐ షణ్ముఖసాయి నుంచి శనివారం వెంకట్‌కుమార్ చార్జ్ తీసుకోనున్నారు. వెంకట్‌కుమార్ అమరావతి హైకోర్టులో లీగల్ అడ్వజర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ముదినేపల్లి ఎస్ఐగా పని చేస్తున్న షణ్ముఖసాయి బదిలీపై వెళ్లనున్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

మహిళలకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు, విజయలక్ష్మి కోరారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో విఒఎలు, డ్వాక్రా యానిమేటర్ల మండల కమిటీ సమావేశం శుక్రవారం అలుమోలు కరుణ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా రమణరావు, విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పాత పట్టిసీమలో మత్స్యకారులకు ఎస్ఐ పవన్‌కుమార్ పలు సూచనలు చేశారు. వర్షాల కారణంగా గోదావరి నదీ ప్రవాహం ప్రమాదస్థాయిలో ఉన్నందున పోలవరం, గూటాల, పట్టిసీమ, తాళ్లపూడి గ్రామాల్లో నివసించే మత్స్యకారులు పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లడం పూర్తి నిషేధమని, ఇతర ప్రాంతాల్లో తదుపరి ఉత్తర్వుల కోసం మత్స్య శాఖ సూచనలు పాటించాలని, అతిక్రమించిన వారు ప్రమాదాలకు గురవవుతారని చెప్పారు. ప్రోత్సహించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'ప్రజలను మోసగిస్తున్న జగన్'

టి.నరసాపురం : నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను జగన్ మోసగిస్తున్నారని దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. మండలంలోని తిరుమలదేవిపేటలో శుక్రవారం నిర్వహించిన టిడిపి బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న చింతమనేని, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, పోలవరం నియోజ కవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసిపి పార్టీలో సుమారు 200 మంది టిడిపిలో చేరారు. వీరిని సాదారంగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు, పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు రామకష్ణ గౌడ్ పాల్గొన్నారు.

వైసిపి బైక్ ర్యాలీ

చింతలపూడి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చాలా ఉపయోగపడిందని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. చింతలపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 175 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ వద్ద రాజశేఖర్‌రెడ్డి, అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాస్‌పోర్టు పోయినది

నరసాపురం మండలం, చిట్టవరంకు చెందిన గొల్ల సుధ అను నేను ది. 11-7-2023 మంగళవారం చిట్టవరం నుంచి పాలకొల్లు మండలం దిగమర్రుకు చెందిన మా బంధువు ఇంటికి నా వీసా గురించి మాట్లాడటానికి నా భర్తతో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా నేను వైజాగ్‌లో 21-02-2023లో పొందిన **X5967182** పాస్‌పోర్టు దారిలో పడిపోయినది. దారిలో ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందచేయ వలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా అడ్రస్:
గొల్ల సుధ, W/o. శ్యామలరావు
డోర్ నెం. 3-40, లంగరువు
చిట్టవరం గ్రామం, నరసాపురం మండలం
ప॥గో॥జిల్లా, సెల్: 9493833533

డాక్యుమెంటు పోయినది

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ది. 18-7-2023వ తేదీన నా స్థలమునకు చెందిన లింకు డాక్యుమెంట్లు అనగా డాక్యుమెంటు నెం. 5146/2004, **డాక్యుమెంటు నెం. 9213/2016** లు నేను జిరాక్స్ తీయించే నిమిత్తము తీసుకుని ఇంటి వద్ద నుండి జిరాక్స్ షాపునకు తీసుకుని వెళ్ళుతుండగా దారి మధ్యలో ఎక్కడనో జారి పడిపోయినవి. కావున పై తెల్పిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు ఎవరికైనను దొరికినచో వెంటనే నాకు అందజేయవలెను. అట్లు అందించిన వారికి మంచి బహుమతి ఇవ్వబడును అని యిందు మూలముగా తెలియజేయుచున్నాను.

అడ్రస్:
బేతిరెడ్డి ఇంద్రావతి, W/o. ఈశయ్య
డోర్ నెం. 6-95, పల్లపు వీధి
పెనుమంట్ర, ప॥గో॥జిల్లా, (ఎపి),
పిన్: 534124, సెల్: 8184891939